

# చిన్నారుల భద్రతే పోలీసుల లక్ష్యం!

- ఈతకు వెళ్లే పిల్లలు తస్మాత్ జాగ్రత్త
- చెరువులు, బావుల వద్ద హెచ్చరిక బోర్డులు
- బెజ్జంకి ఎస్ఐ బోయిని సౌజన్య

**బెజ్జంకి, ఏప్రిల్ 22 (జనం పవర్):** వేసవి సెలవుల దృష్ట్యా ఈతకు వెళ్లే చిన్నారుల భద్రత కోసం బెజ్జంకి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్ఐ బోయిని సౌజన్య ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల చెరువులు, బావులు, వాగుల వద్ద బుధవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈత రాని చిన్న పిల్లలు.. యువకులు ఈత నేర్చుకునేందుకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్యానర్లు కట్టారు.

## తల్లిదండ్రులదే బాధ్యత

సెలవుల్లో పిల్లలు ఈతకు వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని ఎస్ఐ స్పష్టం చేశారు. పిల్లల కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని.. వారు వాగులు, వంకల వైపు వెళ్లకుండా అడ్డుకోవాలని సూచించారు. సరదా కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు.

## కడుపుకోత మిగల్చవద్దు

ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చవద్దని ఎస్ఐ సౌజన్య యువతకు విజ్ఞప్తి చేశారు. ఆడుకునే పేరుతో నీటి కుంటల వద్దకు వెళ్లే వారిపై దృష్టి సారించామన్నారు. ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరికలను ప్రజలంతా పాటించాలని కోరారు.

# కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా అశోక్!

- నిజాయితీకి దక్కిన గుర్తింపు: ప్రణవ్ బాబు
- మడిపల్లి నాయకుడికి జిల్లా స్థాయి పదవి
- జమ్మికుంటలో ఘనంగా సన్మానం



**జమ్మికుంట, ఏప్రిల్ 22 (జనం పవర్):** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మ్యాకమల్ల అశోక్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ నియామక జాబితాలో ఆయనకు చోటు దక్కింది. ఈ సందర్భంగా బుధవారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు అశోక్ ను ఘనంగా సన్మానించారు. నిజాయితీతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ప్రణవ్ బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అశోక్ నియామకమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అశోక్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ పదవి ఇతర కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి.. సుంకరి రమేష్.. సదయ్య.. ఎగేటి కుమారస్వామి.. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశురాం రావు.. గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివారెడ్డి.. సాయిని రవి.. మేకమల్ల వెంకటేష్ పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన అశోక్ కు తోటి నాయకులు.. కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ సమ్మెకు మున్సిపల్ చైర్మన్ మద్దతు!

## దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆకాష్.. అహ్మద్

## పోరాటానికి బీఆర్ఎస్ శ్రేణుల సంఘీభావం



**నగేష్, జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్.. వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసమే కార్మికులు సమ్మెకు దిగారని.. వారి పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికుల డిమాండ్లను అంగీకరించి వెంటనే సమ్మె విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు.. బాలకృష్ణ.. సలం బీన్ అహ్మద్.. మాజీ ఏఎమ్ సీ సింగల్ విండో చైర్మన్ గంధం శ్రీనివాస్.. అలీ బీన్ అహ్మద్.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నీసార్.. దూడల అశోక్ పాల్గొన్నారు. కార్మికులకు అండగా ఉండి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని నేతలు హామీ ఇచ్చారు.




# విజయగిరిలో హిందూ సమ్మేళనం!

## జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తిన నాగం పేట

**జమ్మికుంట, ఏప్రిల్ 22 (జనం పవర్):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జమ్మికుంట ఖండ ఆధ్వర్యంలో విజయగిరి ఉప మండలంలో హిందూ ధర్మ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నాగం పేట గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ ధర్మం.. సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి స్వామీజీ ఎస్పీ వెంకటాచార్యులు.. వివేకానంద కేంద్ర కార్యకర్త గుండా సుధా శ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హిందూ కుటుంబాల సంస్కృతి.. సంప్రదాయాల గురించి వివరిస్తూ వారు దిశానిర్దేశం చేశారు. "శ్రీరామ జయరామ జయ జయ రామ".. "రామలక్ష్మి జానకి జై బోలో హనుమాన్ కి" అంటూ గ్రామంలో చేసిన నినాదాలు మిన్నంటాయి. హిందూ ధర్మం ప్రపంచంలోనే అత్యంత గొప్పదని.. అది ఒక జీవన విధానమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరి జగదీశ్వర్.. నరసింహారెడ్డి.. సర్పంచ్ కప్పల పోశెట్టి.. తోడేటి శ్రీనివాస్.. బాపూరావు.. కేవీడీఈ కుమార్ స్వామి.. ఉపసర్పంచ్ వెంగళ సుమలత – లింగమూర్తి.. ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవా దాసరి రవీందర్.. ఎక్కడి రఘుతం రెడ్డి.. ఆకుల రాజేందర్.. సంపెల్లి సంపత్ రావు.. టంగుటూరి రాజ్ కుమార్.. పొట్టల మల్లేష్.. అవును తిరుపతి.. పాకల రవీందర్ రెడ్డి.. పొన్నగంటి రవికుమార్.. దయ్యాల ప్రభాకర్.. కామ ప్రశాంత్.. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసీఆర్ జగిత్యాల పర్యటన సిగ్గుచేటు!

## జీవన్ రెడ్డికి అపాయింట్‌మెంట్ దొరకదు

## మాజీ ఉపసర్పంచ్ బండి వేణు యాదవ్



**బెజ్జంకి, ఏప్రిల్ 22 (జనం పవర్):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీ ఆర్ ఎస్ అధినేత కే సీ ఆర్ జగిత్యాల పర్యటన చేయడం సిగ్గుచేటని బెజ్జంకి మాజీ ఉపసర్పంచ్ బండి వేణు యాదవ్ విమర్శించారు. బుధవారం బెజ్జంకిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం జరిగినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించని కే సీ ఆర్.. ఇప్పుడు స్వార్థ రాజకీయాల కోసం రావడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిని తమ పార్టీలోకి ఆహ్వానించడం కోసమే కే సీ ఆర్ ఈ పర్యటన చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ లబ్ధి కోసం సీనియర్ నాయకులను వాడుకుంటున్నారని.. భవిష్యత్తులో జీవన్ రెడ్డికి కే సీ ఆర్ అపాయింట్‌మెంట్ కూడా దొరకదని ఎద్దేవా చేశారు. నాడు ప్రజల కష్టాలను పట్టించుకోని కే సీ ఆర్.. ఇప్పుడు కేవలం ఎన్నికల వ్యూహాలతో జగిత్యాల రావడంపై జనం ఆగ్రహంతో ఉన్నారని వేణు యాదవ్ పేర్కొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ మన బాధ్యత!

## గోయగాంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ విడుదల

## ఏప్రిల్ 29న అశోక్ పూలే అంబేద్కర్ ఫెస్టివల్



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ పిలుపునిచ్చారు. కెరమేరి మండలంలోని గోయగాం గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ.. రాష్ట్రీయ అశోక్ పూలే అంబేద్కర్ ఫెస్టివల్ గోడ పత్రికలను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ అహ్మద్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతీయులకు అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని కొనియాడారు. ఈనెల 29వ తేదీ బుధవారం సాయంత్రం గోయగాం గ్రామంలో నిర్వహించే ఉత్సవాలను ప్రజలంతా కలిసి జయప్రదం చేయాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూనే.. బాధ్యతలను విస్మరించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నగ్రారే తారు.. ఉపాధ్యక్షుడు టీ దత్తు.. ప్రధాన కార్యదర్శి ఎం శంకర్.. కోశాధికారి టీ ఆనంద్ రావు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెపై సీఎం జోక్యం చేసుకోవాలి!

## కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

## ప్రైవేటు డ్రైవర్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు

## సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు

## జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని.. సమ్మె విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సిద్దిపేట బస్ డిపో ముందు కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మిక.. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

## హామీలు నెరవేర్చాలి

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని పవన్ డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి.. వెంటనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. నిలిచిపోయిన రెండు వేతన సవరణలను (పీఆర్సీ) తక్షణమే అమలు చేయాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేయడంతో పాటు.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రమాదకరంగా ప్రత్యామ్నాయ చర్యలు

అనుభవం లేని ప్రైవేటు డ్రైవర్లను వినియోగించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని పవన్ విమర్శించారు. సమ్మెను అణచివేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రమాదకరమని హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్.. జేఏసీ నాయకులు రాజయ్య.. మల్లేశం.. రవీందర్ గౌడ్.. రాములు.. బీఎస్ గౌడ్.. హేమలత.. రవి కుమార్ పాల్గొన్నారు.





# సర్కారీ బడి.. విజ్ఞాన నిధి!

- ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్‌లో నాణ్యమైన బోధన
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్య
- సదాశివపేట మండలంలో జోరుగా 'బడిబాట'
- ఎంఈఓ ఎన్ శంకర్ వెల్లడి

**సదాశివపేట, ఏప్రిల్ 22 (జనం పవర్):** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందుతుందని సదాశివపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎన్ శంకర్ తెలిపారు. పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ముందస్తు 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్ సిబ్బందితో కలిసి మాలపహాడ్, ఏటిగడ్డ సంఘం పాఠశాలలను ఆయన సందర్శించారు.

### వసతులపై అవగాహన

ఈ సందర్భంగా ఐదు, ఏడో తరగతి పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ మాట్లాడారు. ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్ లో ఉన్న వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రైవేట్ కు దీటుగా సర్కారీ బడుల్లో వసతులు



కల్పించామని, తమ పిల్లలను ఆత్మకూరు పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పాఠశాల ఉపాధ్యాయ బృందం, మాలపహాడ్ మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ మొగులయ్య, వార్డు సభ్యుడు ఖలీల్, ప్రధానోపాధ్యాయులు గౌతమి, మహేష్, సుమలమ్మ, సంతోష్, గోపాల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ఈ సందర్భంగా ఎంఈఓ పరిశీలించారు.

# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం!

- తేర్పోల్, ఎదురుగూడెంలో మహిళా భవనాలకు భూమిపూజ
- ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయడమే ధ్యేయం
- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. బుధవారం కొండాపూర్ మండలం తేర్పోల్, ఎదురుగూడెం గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే మహిళా సమాఖ్య భవనాలకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మలా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతి అని.. వారి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా పావలా వడ్డీకే రుణాలు అందిస్తూ ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. ఇవే కాకుండా మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు, మహిళల పేరుతోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఇల్లు లేని వారికి మహిళల పేరు మీదనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం విడతల వారీగా అందజేస్తామని చెప్పారు. గత పాలకుల మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని.. చేతల్లో చూపిస్తుందని స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో గ్రామాల్లో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సర్పంచ్ సతీష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం గౌడ్, నర్సింలు, ప్రభుదాసు, అశోక్, గోపాల్, పంచాయతీ సభ్యులు, ఐకేపీ వీఓలు, అధికారులు పాల్గొన్నారు.

# మోదీపై వ్యాఖ్యలకు నిరసన.. ఖర్గే దిష్టిబొమ్మ దహనం!

- ప్రధానిని అవమానిస్తే సహించేది లేదు: బీజేపీ
- సంగారెడ్డిలో బీజేవైఎం శ్రేణుల ఆందోళన
- కాంగ్రెస్ సంస్కృతిపై జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ ఆగ్రహం

**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో బుధవారం బీజేపీ యువజన విభాగం (బీజేవైఎం) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ తీరును ఎండగడుతూ బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.

### అజ్ఞానానికి నిదర్శనం

ఈ సందర్భంగా ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ ప్రధానిని తీవ్రవాదితో పోల్చడం ఖర్గే అజ్ఞానానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రపంచ దేశాలన్నీ మోదీ నాయకత్వాన్ని గుర్తిస్తుంటే.. ఇక్కడ ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ఇలాంటి ధోరణిని వీడకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ఆందోళనలో రాములు, నర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వెంచర్ల అనుమతుల్లో నిబంధనలు పాటించాలి!

క్యాతనపల్లిలో క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలన

రికార్డులు సరిచూశాకే దరఖాస్తుల పరిష్కారం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ల కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి భూమిని ఆయన స్వయంగా తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ తో కలిసి ఆయన ఈ పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వెంచర్ల అనుమతుల విషయంలో ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకూడదని స్పష్టం చేశారు. అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి.. రికార్డులను క్షుణ్ణంగా సరిచూసిన తర్వాతే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఆటోల దోపిడీ!

సమ్మె సాకుతో అడ్డగోలు వసూళ్లు

పటాన్‌చెరు రూట్లో ప్రయాణికులపై బాదుడు

పట్టించుకోని రవాణా శాఖ అధికారులు



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆటో నిర్వాహకులు ప్రయాణికులపై అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి-పటాన్‌చెరు మార్గంలో ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి పటాన్‌చెరుకు ఆర్డినరీ బస్సులో రూ.40, ఎక్స్‌ప్రెస్‌లో రూ.60 ఛార్జీ ఉంటుంది. కానీ సమ్మె కారణంగా బస్సులు లేకపోవడంతో ఆటో డ్రైవర్లు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు చేసేదేమీ లేక అధిక ధరలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది బహిరంగ దోపిడీ అని, అధికారులు తక్షణమే స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రూట్లలో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా డబ్బులు వసూలు చేసే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

# సంగారెడ్డి అదనపు ఎస్పీగా చైతన్య రెడ్డి!

ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసిన నూతన అధికారి

శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత

బాధ్యతలు చేపట్టిన 2022 బ్యాచ్ ఐపీఎస్ అధికారి



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా చైతన్య రెడ్డి, ఐపీఎస్, బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్,ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చైతన్య రెడ్డి, ఐపీఎస్, 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. జిల్లాలో నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను ప్రశాంతంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# రక్షిత.. రికార్డు విజయం!

## ఇంటర్‌లో 989 మార్కులతో సంచలనం

### సర్కారీ చదువుతో కార్పొరేట్ స్థాయి ప్రతిభ.. గల్ఫ్ కార్మికుల సమితి ఘన సన్మానం






**తుడుం జితేందర్ -జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో**

కష్టపడి చదివితే ఆకాశమే హద్దు అని నిరూపించిన గల్ఫ్ కార్మికుని కుమార్తె పాలజీ రక్షితను రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలజీ శ్రీనివాస్, మాలతీ దంపతుల కుమార్తె రక్షిత ఇటీవలి ఇంటర్మీడియట్ ఫలితాల్లో 989 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని గ్రామ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షులు ఉప్పు తిరుపతి సూచన మేరకు గ్రామంలో ఆమెకు ప్రత్యేక గౌరవం లభించింది.

**సర్కారీ చదువు.. అదిరిపోయే ప్రతిభ**

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సమితి వ్యవస్థాపకులు సేపూరి గోపాల్ మాట్లాడుతూ రక్షిత విద్యా ప్రయాణాన్ని కొనియాడారు. రక్షిత ఐదవ తరగతి నుంచి మహాత్మా జ్యోతిబా పూలే (ఎమ్ జే పీ) గురుకుల పాఠశాలలో చదివి పునాది వేసుకుందని, అనంతరం హసన్‌పర్తిలోని తెలంగాణ ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (టీ జీ ఆర్ జే సీ)లో ఇంటర్ పూర్తి చేసిందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతూ కార్పొరేట్ స్థాయికి మించి మార్కులు సాధించడం గ్రామస్తులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. కన్నవారి కష్టాన్ని గుర్తించి, క్రమశిక్షణతో చదువుకుంటే ఏదైనా సాధ్యమని రక్షిత నిరూపించిందన్నారు.

**కార్మికుల పిల్లలకు ఆదర్శం**

కుటుంబ పోషణ కోసం విదేశాల్లో ఎండనక వాననక శ్రమిస్తున్న తండ్రి కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకున్న రక్షిత.. గల్ఫ్ కార్మికుల బిడ్డలందరికీ ఆదర్శంగా నిలిచిందని సభ్యులు తెలిపారు. విదేశాల్లో శ్రమిస్తున్న తల్లిదండ్రుల కలలను విద్యార్థులు ఇలాగే నిజం చేయాలని కోరారు. చదువుపై ఏకాగ్రత పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా సమితి సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, గ్రామస్తులైన ఉప్పు సురేష్, పాలజీ శ్రీనివాస్, శివనూరి శ్రీనివాస్, ఉప్పు మల్లేశం, ఉప్పు రవి, జిల్లాపెల్లి మహేష్, ఉప్పు నరేష్, ఒడ్డెటి రమేష్, పాలజీ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

# కల్వల ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయండి!

**తనుగుల చెక్ డ్యాం పునరుద్ధరణకు ప్రణవ్ వినతి**

**సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్**



**జమ్మికుంట, ఏప్రిల్ 22 (జనం పవర్):** వీణవంక, జమ్మికుంట మండలాల రైతుల సాగునీటి కష్టాలను తీర్చే కల్వల ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. బుధవారం సచివాలయంలోని ఛాంబర్‌లో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

**త్వరలోనే పునరుద్ధరణ పనులు**

గుంపుల–శంభునిపల్లి గ్రామాల పరిధిలోని తనుగుల చెక్ డ్యాంను కూడా త్వరితగతిన పునరుద్ధరించాలని ప్రణవ్ మంత్రికి విన్నవించారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.

**మంత్రి హామీ**

ప్రణవ్ చేసిన విన్నపంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని.. కల్వల ప్రాజెక్ట్, తనుగుల చెక్ డ్యాం పునరుద్ధరణ పనులను త్వరలోనే మొదలుపెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వొడితల ప్రణవ్ వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



# సర్కారీ బడిలో గ్రాడ్యుయేషన్ డే!

## యూకేజీ చిన్నారుల చదువుల పండుగ

### వినూత్న కార్యక్రమంపై తల్లిదండ్రుల హర్షం

### ఆకర్షణీయమైన విద్యే లక్ష్యం: హెచ్ఎం తిరుపతి



**బెజ్జంకి, ఏప్రిల్ 22 (జనం పవర్):** మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉండ్రాళ్ళ తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అరుదని.. ముఖ్యంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే చేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

**విద్యార్థుల ఆకర్షణే ధ్యేయం**

గుండారం పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులను చదువు వైపు ఆకర్షిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఇలాంటి వేడుకల వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జంగోని శ్రీనివాస్, శిరీష, హరీష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రహిత తెలంగాణే లక్ష్యం!

**గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి**

**అక్టోబర్ 11న గచ్చిబౌలిలో మెగా ఈవెంట్**

**జిల్లా ఆసుపత్రుల్లోనే కీమోథెరపీ సేవలు**

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ నివారణ.. అవగాహనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాన్సర్ అవేర్‌నెస్ డ్రైవ్ రన్ వాల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 130 దేశాలలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

**అక్టోబర్‌లో గ్లోబల్ రన్**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో అక్టోబర్ 11, 2026న 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్' నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు. గత ఏడాది గచ్చిబౌలిలో 35 వేల మంది.. ప్రపంచవ్యాప్తంగా 3 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రేస్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలను మంత్రి అభినందించారు.

**సర్కారు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం**

తెలంగాణ ప్రభుత్వం క్యాన్సర్ బాధితులకు అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. అన్ని జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు.. కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ కేంద్రాల ద్వారా ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. నిమ్స్.. ఎమ్ ఎన్ జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ సేవలు ఉచితంగా అందుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి, యశోద ఆస్పత్రి ప్రతినిధి డా. సాయి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



# బార్లను తలదన్నేలా వైన్ షాపులు!



## నిబంధనలకు పాతర.. పర్మిట్ రూముల్లో రెస్టారెంట్ తరహా సేవలు

### గోదాముల్లో నిల్వ చేసి బెల్ట్ షాపులకు మద్యం తరలింపు

### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

### బిచ్చుంద మండలంలో మద్యం మాఫియా ఆగడాలు



**జుక్కల్, ఏప్రిల్ 22 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. ఇక్కడి వైన్ షాపులు బార్లను తలదన్నేలా వ్యవహరిస్తూ రెస్టారెంట్ తరహా సేవలు అందిస్తున్నాయి. పర్మిట్ రూములకు మాత్రమే అనుమతి ఉన్నా, అక్కడ సిట్టింగ్ ఏర్పాటు చేసి తినుబండారాలు, వాటర్ బాటిల్స్ కస్టమర్ల దగ్గరికే అందిస్తూ నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు.

### బహిరంగంగానే బెల్ట్ షాపులకు సరఫరా

వైన్స్ యజమానులు కేవలం షాపులకే పరిమితం కాకుండా బెల్ట్ షాపులకు కూడా మద్యం సరఫరా చేస్తున్నారు. గతంలో చాటుమాటుగా సాగే ఈ దందా, ఇప్పుడు బహిరంగంగానే సాగుతోంది. బెల్ట్ షాపుల కోసం ప్రత్యేకంగా ఒక గోదాం ఏర్పాటు చేసి, ఆటోలలో మద్యం తరలిస్తుండటం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. దీనివల్ల గ్రామాల్లో 24 గంటల పాటు మద్యం అందుబాటులోకి వచ్చి ఏరులై పారుతోంది.

### యువత పెడదారి.. అధికారుల మౌనం

సమయం సందర్భం లేకుండా మద్యం దొరకడంతో యువత వ్యసనాలకు బానిస అవుతోంది. నిత్యం ఘర్షణలు చోటుచేసుకుని మరణాలకు దారితీస్తుండటంతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఈ అక్రమ తంతుపై ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ముడుపులు ముట్టడం వల్లే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బెల్ట్ షాపులను నియంత్రించాలని, పర్మిట్ రూములపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# విలీనం చేయాల్సిందే.. ఆర్టీసీ సమ్మె సైరన్!



- విలీనం చేయాల్సిందే.. ఆర్టీసీ సమ్మె సైరన్!
- 32 డిమాండ్లపై సర్కార్ మొండివైఖరిపై ఆగ్రహం
- మహాలక్ష్మి స్కీమ్ తో పెరిగిన పని ఒత్తిడి
- సిద్దిపేట డిపో ముందు ఉధృతంగా ధర్నా
- కార్మిక గర్జనతో దద్దరిల్లిన పట్టణం

**సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 22 (జనం పవర్):** సిద్దిపేట పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల ధర్నా ఉధృతంగా కొనసాగుతోంది. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఆందోళన బుధవారం ఉదయం వరకు ఆగకుండా సాగుతూనే ఉంది. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ కమిటీల నాయకులు ఈ సమ్మెకు నేతృత్వం వహిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు కదం తొక్కారు.

### అమలు కాని హామీలు

ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 32 ప్రధాన డిమాండ్లతో 45 రోజుల క్రితమే ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినప్పటికీ.. ఎలాంటి స్పందన లేకపోవడాన్ని తప్పుపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ ఏమైందని నిలదీశారు. తొలి సంతకంతోనే విలీనం చేస్తామని చెప్పి ఇప్పుడు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

### ప్రధాన డిమాండ్లు ఇవే..

ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయడం, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ కల్పించడం, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను అమలు చేయడం వంటివి ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. 1/4, 14/25 పే స్కేల్‌లను అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు గౌరవప్రదమైన పని పరిస్థితులు, తగిన సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని సమయంలో విశ్రాంతి లేకపోవడంపై మహిళా కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



### మహాలక్ష్మితో పెరిగిన ఒత్తిడి

మహాలక్ష్మి పథకం కారణంగా బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిందని కార్మికులు పేర్కొన్నారు. ఒక్కో బస్సులో 150 మంది వరకు ప్రయాణిస్తుండటంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. తమకు సంఘాల రాజకీయాలు ముఖ్యం కాదని.. కార్మికుల భవిష్యత్తు, ఉద్యోగ భద్రతే ప్రధానమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను పరిష్కరించకుంటే పోరాటం ఆపే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ నిరసనలో బీసీ కమిటీ అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి నాయకం, ఎస్సీ/ఎస్టీ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి బాలకిషన్, జేఏసీ సభ్యులు రవీందర్, మల్లేశం, రాజేందర్, రాజయ్య, ఏపీ లతా, నారాయణ పాల్గొన్నారు.











# చిరుధాన్యాలే ఆరోగ్య సోపానాలు!

- సిద్దిపేటలో ఘనంగా మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్
- పాశ్చాత్య జంక్ ఫుడ్స్ తో అనారోగ్య ముప్పు
- రేషన్ షాపుల ద్వారా చిరుధాన్యాలు అందించాలి
- ప్రముఖ ఆహార శాస్త్రవేత్త మిల్లెట్ రాంబాబు హెచ్చరిక






**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

భారతీయ సంస్కృతిలో భాగమైన చిరుధాన్యాలు ఆరోగ్యాన్ని రక్షించే సులభ సోపానాలని వక్తలు పేర్కొన్నారు. సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగా సొసైటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా.. పబ్లిక్ సర్వెంట్స్ హోమ్ సౌజన్యంతో ఎన్జీవో భవనంలో నిర్వహించిన మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా చిరుధాన్యాల విశిష్టతను వక్తలు కొనియాడారు.

## అపోహలు వద్దు.. ఆరోగ్యం ముద్దు

ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ ఆహార శాస్త్రవేత్త మిల్లెట్ రాంబాబు మాట్లాడుతూ చిరుధాన్యాలతో రుచికరమైన ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని తెలిపారు. వీటిపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచిస్తూ.. చిరుధాన్యాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. రోటీలు, దోశలు, పొంగల్, ఉప్మా, స్వీట్స్ వంటి అనేక వంటకాలను వీటితో తయారు చేసే విధానాన్ని వివరించారు. పాశ్చాత్య ఆహారాలైన పిజ్జా, బర్గర్, చిప్స్ వంటి జంక్ ఫుడ్స్ వల్ల అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని హెచ్చరించారు.

## రేషన్ ద్వారా పంపిణీ చేయాలి

సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చిరుధాన్యాలను ప్రోత్సహించాలని.. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీష్ రావు సంకల్పమైన "ఆరోగ్య సిద్దిపేట" సాధన కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడుతూ భారతీయ యోగ, ఆయుర్వేదం, సంప్రదాయ ఆహారం ప్రపంచానికి గొప్ప వరమని చెప్పారు.

## వంటల ప్రదర్శన.. విజేతలకు బహుమతులు

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మిల్లెట్స్ వంటల ప్రదర్శనలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వైవిధ్యమైన వంటకాలను ప్రదర్శించారు. ఉత్తమ వంటలు ప్రదర్శించిన పి స్వాతి, సిహెచ్ శ్రావిక, పి శ్రీదేవి, ఐ విజయలక్ష్మి, జీ సరితలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యోగా శిక్షకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 300 మంది ఈ ఫుడ్ ఫెస్టివల్ లో పాల్గొని చిరుధాన్యాల వంటకాలను రుచి చూశారు.










# సత్యవ్రత్ మృతి తీరని లోటు!

**జోగిపేటలో కాంగ్రెస్ బలోపేతానికి విశేష కృషి**

**చంద్రప్ప ఆశయాలతో ప్రజాసేవ**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతాపం**



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆందోల్ పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సులుగంటి సత్యవ్రత్ మరణం పట్ల రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వాతంత్ర సమరయోధుడు, రజాకార్లను ఎదిరించిన మహనీయుడు సులుగంటి చంద్రప్ప కుమారుడైన సత్యవ్రత్.. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవ చేశారని కొనియాడారు. జోగిపేట కీర్తిని దశదిశలా వ్యాపింపజేయడంలో వారి కుటుంబం పాత్ర గొప్పదని గుర్తు చేసుకున్నారు. జోగిపేటలో ఆర్యసమాజ్ స్థాపనలో సత్యవ్రత్ కీలక పాత్ర పోషించారని మంత్రి తెలిపారు. రాజకీయాల పట్ల ఉన్న ఆసక్తితో మాజీ ఎంపీ మాణిక్ రెడ్డి నాయకత్వంలో జోగిపేటలో టీడీపీ స్థాపనలో ఆయన ముఖ్య భూమిక పోషించారని పేర్కొన్నారు. అనంతరం 1999 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరి, తనతో కలిసి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారని వివరించారు. సత్యవ్రత్ పనితనాన్ని గుర్తించి ఆందోల్ పీఏసీఎస్ డైరెక్టర్ గా, వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించినట్లు గుర్తు చేశారు. సత్యవ్రత్ మరణం జోగిపేట కాంగ్రెస్ పార్టీకే కాకుండా.. లింగాయత్ సమాజానికి కూడా తీరని లోటు అని మంత్రి దామోదర్ అన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, సత్యవ్రత్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత!

**ఉద్యోగుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి**

**ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణ కుట్ర**

**మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి.. బస్సులు ఆపేశారు**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించి సమ్మెను విరమింపజేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఐడీహెచ్ కాలనీలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగానే కార్మికులు రోడ్డెక్కాల్సి వచ్చిందని మండిపడ్డారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించకుండా ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చి ఉద్యోగుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నారని తలసాని విమర్శించారు. నిబంధనల ప్రకారం ఉన్న ఉద్యోగులకే అవసరమైన శిక్షణ ఇచ్చి ఎలక్ట్రికల్ బస్సుల్లో నియమించాలని సూచించారు. ప్రైవేట్ వ్యక్తులను డ్రైవర్లు, కండక్టర్లుగా నియమించడం.. డిపోలు, ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు ఎలా ధారాదత్తం చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సమ్మె కారణంగా బస్సులు నడవక విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, పేద ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తలసాని వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు బస్సులు లేక వారు ఎలా ప్రయాణించాలో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ప్రచారం కోసం పథకాలు ప్రకటించడం తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# పోటు రంగారావుపై ఎన్ఐఏ ప్రశ్నల వర్షం!

**ఖమ్మం పార్టీ ఆఫీసులో రెండున్నర గంటల పాటు విచారణ**

**గాదె ఇన్నయ్యతో సంబంధాలు, కగార్ అంశాలపై ఆరా**

**మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విచారణ**

**ఖమ్మం, ఏప్రిల్ 22:** మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును బుధవారం ఎన్ఐఏ అధికారులు విచారించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నలుగురు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు రెండున్నర గంటల పాటు ఈ విచారణ ప్రక్రియ కొనసాగింది. విచారణ అనంతరం పోటు రంగారావు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు తన విద్యాభ్యాసం, వివాహం, సంతానం వంటి వ్యక్తిగత వివరాలను అడిగారని తెలిపారు. ముఖ్యంగా గాదె ఇన్నయ్యతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారని పేర్కొన్నారు. హెడ్మాతల్లి ఓదార్చిన అంశంలో ఆర్థిక సాయం, నిషేధిత పార్టీలతో ఉన్న విభేదాలపై కూడా ప్రశ్నలు సంధించినట్లు వెల్లడించారు. "కగార్ ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?", "ఎన్ఐఏ పట్ల సమాజంలో భయాందోళనలు ఎందుకు రేకెత్తిస్తున్నారు?", "కగార్ కు వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు చేపట్టారు?" వంటి అంశాలపై అధికారులు తనను ప్రశ్నించారని రంగారావు వివరించారు. ఎన్ఐఏ అధికారులు రంగారావును విచారిస్తున్నారన్న సమాచారంతో పార్టీ నాయకులు, లాయర్లు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు.



# సంగారెడ్డి బస్టాండ్‌లో ఉద్రిక్తత.. బస్సుల ముట్టడి!

- పోలీసులతో కార్మికుల బాహాబాహీ.. తోపులాట
- డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డంకి
- బస్టాండ్ పరిసరాల్లో యుద్ధ వాతావరణం



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** ఆర్టీసీ బస్సుల తరలింపుపై కార్మికులు ఆందోళనకు దిగడంతో బుధవారం మధ్యాహ్నం సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యాజమాన్యం బస్సులను డిపో నుంచి బయటకు నడిపించేందుకు ప్రయత్నించగా.. కార్మికులు వాటిని అడ్డుకునేందుకు ముందుకు వచ్చారు. దీంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. బస్సులు బయటకు వెళ్లకుండా కార్మికులు నిరసన చేపట్టడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కార్మికులను చెదరగొట్టేందుకు ప్రయత్నించిన పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. ఒక దశలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనతో కొంతసేపు బస్టాండ్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సులు తిరుగుతాయన్న ఆశతో వచ్చిన వారు పోలీసులకు, కార్మికులకు మధ్య ఘర్షణ చూసి బెంబేలెత్తిపోయారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు బస్సులను రోడ్డెక్కనిచ్చేది లేదని కార్మికులు తెగేసి చెప్పారు.

# కాళేశ్వరం తీర్పు సత్యం, ధర్మం విజయం!

- రేవంత్ సర్కార్ కక్షసాధింపు రాజకీయాలకు చెంపపెట్టు
- సత్యం, ధర్మం పక్షాన నిలిచిన గౌరవ హైకోర్టు
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హర్షం
- కేసీఆర్, హరీశ్ రావులకు శుభాకాంక్షలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనం పవర్):** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఘనంగా హర్షించారు. న్యాయస్థానంలో అంతిమంగా సత్యం, ధర్మమే గెలిచాయంటూ పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## బీఆర్ఎస్ నైతిక విజయం

కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు సత్యం పక్షాన నిలిచిందని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ రైతాంగానికి దక్కిన నైతిక విజయమని కొనియాడారు. తెలంగాణ జలప్రదాత కేసీఆర్, ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన హరీశ్ రావులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కేవలం రాజకీయ కక్షసాధింపుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘోష్ కమిషన్ వ్యాఖ్యలు చెల్లవని కోర్టు తేల్చిచెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బ అని విమర్శించారు.

## బట్టబయలైన కుట్రలు

కేవలం రెండు పిల్లర్లకు చిన్న రిపేర్లు చేస్తే సరిపోయే దానికి.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ తీర్పుతో కాంగ్రెస్ నాయకుల రాజకీయ కుట్రలు ప్రజల ముందు బట్టబయలయ్యాయని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ అద్భుత సృష్టిని మసిపూసి మారేడుకాయ చేయాలని చూసిన వారికి ఇప్పటికైనా జ్ఞానోదయం కావాలని హితవు పలికారు. ప్రభుత్వం వెంటనే రాజకీయ డ్రామాలు కట్టిపెట్టి.. పిల్లర్లకు మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

# బస్సులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు!

**విధులకు వచ్చే డ్రైవర్లకు పూర్తి రక్షణ**

**సీసీటీవీ కెమెరాలతో అల్లరిమూకలపై నిఘా**

**ఆస్తులు ధ్వంసం చేస్తే భవిష్యత్తు అంధకారం**

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరిక**

**వికారాబాద్, ఏప్రిల్ 22:** విధులకు హాజరయ్యే ఆర్టీసీ డ్రైవర్లందరికీ పోలీసు శాఖ తరపున పూర్తి రక్షణ కల్పిస్తామని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ స్పష్టం చేశారు. ఎవరైనా వారి విధులకు ఆటంకం కలిగించినా.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

## ప్రజా ఆస్తుల రక్షణ అందరి బాధ్యత



ప్రభుత్వ ఆస్తులను, ముఖ్యంగా ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేయడం నేరమని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోగుల రవాణా కోసం నడిచే బస్సులు ఉమ్మడి ఆస్తి అని.. వాటిపై దాడులు చేయడం వల్ల సామాన్య ప్రజలే ఇబ్బందులు పడతారని తెలిపారు. నిరసనల పేరుతో బస్సులపై రాళ్లు రువ్వడం, అద్దాలు పగలగొట్టడం, తగులబెట్టడం వంటి అరాచక చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## నిరంతర నిఘా

విధుల నిర్వహణలో ఉన్న డ్రైవర్లను, కండక్టర్లను అడ్డుకోవడం లేదా వారిపై భౌతిక దాడులకు పాల్పడటం తీవ్రమైన నేరమని ఎస్పీ హెచ్చరించారు. కేవలం దాడులే కాకుండా.. సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ హింసను ప్రేరేపించే వారిపై కూడా నిఘా ఉంచామని తెలిపారు. ఆందోళనలు జరిగే ప్రాంతాలను సీసీటీవీ కెమెరాల ద్వారా నిశితంగా పర్యవేక్షిస్తున్నామని.. వీడియో సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామన్నారు.

## యువతకు హెచ్చరిక

ఒకసారి ఇటువంటి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు కావడమే కాకుండా.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యువతను ఎస్పీ హెచ్చరించారు. నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ.. అది శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, యువత భావోద్వేగాలకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.



# ఖరీఫ్ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందాలి!

**నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ నిఘా**

**నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌ల రద్దు**

**రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశం**

**అదిలాబాద్, ఏప్రిల్ 22:** రాబోయే ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా.. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ బృందాలు, విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

## మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

రైతును మోసం చేసే ఏ ఒక్క డీలర్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని.. అనుమతి లేని విత్తనాలను విక్రయించినా, గడువు ముగిసిన ఎరువులను నిల్వ ఉంచినా లైసెన్స్‌లు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని విత్తన, ఎరువుల డీలర్లు ప్రతి విక్రయానికి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని.. దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

## సమన్వయంతో పని చేయాలి

ఖరీఫ్ ప్రారంభానికి ముందే గ్రామాల్లో ఎరువులు, విత్తనాల లభ్యతపై వ్యవసాయ అధికారులు పక్కా ప్రణాళికతో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి.. సరిహద్దు ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలో రైతులకు అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని కంపెనీల ప్రతినిధులకు స్పష్టం చేశారు.

